## సివిల్ సప్లై హమాలీల సమ్మె

నవతెలంగాణ-బోథ్

సివిల్ సప్లై హమాలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సివిల్ సప్లై గోదాం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర కమిషన్‌తో కుదిరిన ఒప్పందం ప్రకారం క్వింటాల్‌కు రూ.26 నుండి రూ.29కి పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే హమాలీ కార్మికులకు, స్వీపర్‌లకు రూ.10లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ సంఘం కార్మికులు పాల్గొన్నారు.



## నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

**ఆదిలాబాద్‌టౌన్ :** నవతెలంగాణ పత్రిక ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆవిష్కరించారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవీ, నవతెలంగాణ ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. అనంతరం జిల్లా అదనపు న్యాయమూర్తి డా.శివరాంప్రసాద్, పీసీఆర్ కోర్టు న్యాయమూర్తి దుర్గారాణి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, హుస్సేన్‌లు అదనపు న్యాయమూర్తి నివాసం వద్ద నూతన క్యాలెండ్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్ఓ తిరుమల, నవతెలంగాణ రీజనల్ మేనేజర్ కె.నాందేవ్, డెస్క్ ఇంఛార్జి ఆర్.దత్తాత్రి, ఉమ్మడి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మెడపట్ల సురేష్, డివిజన్ ఇంఛార్జి ఉష్కం సురేష్, రిపోర్టర్లు గాజరి శ్రీకాంత్, రాజేశ్వర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



## కిన్వట్ మాజీ ఎమ్మెల్యే ప్రదీప్ నాయక్ గుండెపోటుతో మృతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మహారాష్ట్ర కిన్వట్ మాజీ ఎమ్మెల్యే ప్రదీప్ నాయక్ బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుకున్న కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి కిన్వట్ తాలూకా దహేలి తండాలోని వారి నివాసానికి వెళ్లి ప్రదీప్ నాయక్ పార్థివ దేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రదీప్ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఎమ్మెల్యేగా కిన్వట్ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజా నాయకుడిగా పేరుపొందారని, ఆయనతో ఉన్న అనుబంధాన్ని శ్రీకాంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దామోదర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

## చిన్నారులకు బట్టలు, వృద్ధులకు బ్లాంకెట్ల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని బంగారిగూడ మురికివాడలో పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఆర్థిక స్వచ్ఛంద సంస్థ, ఆరోగ్య జ్యోతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు బట్టలు, వృద్ధులకు బ్లాంకెట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కె.నరేష్ కుమార్ మాట్లాడుతూ నూతన సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకొని మురికివాడ బంగారుగూడలో చిన్నారులకు షూ, బట్టలు, వృద్ధులకు బ్లాంకెట్లు పంపిణీ చేశారు. దాదాపు 100 మంది పిల్లలకు పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా నూతన సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకొని చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అజీజ్, శ్రీకాంత్, ఆసిఫ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎంపీటీసీ

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ మండలం రత్నాపూర్ కాండ్లీకి చెందిన మాజీ ఎంపీటీసీ మహేశ్ బుధవారం బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. వీరి వెంట నిర్మల్ జిల్లా ఇన్చార్జి రామ్‌కిషన్‌రెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ శ్యాంసుందర్ ఉన్నారు.

## మతిస్థిమితంలేని వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-ఇచ్చోడ

మతిస్థిమితం సరిగా లేని వృద్ధురాలు ఆకలి, దప్పికతో మృతి చెందింది. మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన భూతి రాజుబాయి(75) డిసెంబర్ 30న మతిస్థిమితం సరిగా లేక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు 31న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం గ్రామ శివారు పత్తి చేనులో మృతదేహాన్ని గుర్తించారు. ఆకలి దప్పికతో సొమసిల్లి చనిపోయిందని భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

## కలెక్టర్‌ను కలిసిన గెజిటెడ్ అధికారుల సంఘం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతన సంవత్సరంను పురస్కరించుకుని గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు బుధవారం కలెక్టర్ రాజర్షి షాను క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు నోట్ బుక్స్ అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ 2025లో నూతన ఉత్తేజంతో జిల్లా ప్రగతికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ రామారావు, అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్స్ రాజేష్, వామన్, కోశాధికారి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలు అనిల్, నరేష్, మహిళా జాయింట్ సెక్రటరీ వినూత్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేష్, ఈసి మెంబర్ నరేష్ పాల్గొన్నారు.

## పీఆర్‌టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పీఆర్టీయూటీఎస్ సంఘం నాయకులు ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ పీఆర్టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.నరసింహ స్వామి, జిల్లా గౌరవధ్యక్షులు డి.గోవర్ధన్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా మండల బాధ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-బోథ్

ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, సీనియర్ నాయకుడు గాజుల పోతన్న బుధవారం ఉట్నూరులోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఎమ్మెల్యే మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలని, నియోజకవర్గంతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

# భీమా కోరేగావ్ అమరులకు ఘన నివాళి



నవతెలంగాణ-మంచిర్యాల

దేశంలో అనైక్యతలను సృష్టిస్తున్న మనువాద వ్యవస్థను నిర్మూలించడానికి 207 ఏళ్ల క్రితమే పోరాటం చేసిన భీమా కోరేగావ్ అమరవీరులు అందించిన చైతన్యంతో సమాజంలో కులవ్యవస్థ నిర్మూలనకు దేశ ప్రజలందరూ నడుం కట్టాలని వివిధ బహుజన సామాజిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో బుధవారం భీమా కోరేగావ్ అమరవీరుల శౌర్య దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక అమరవీరుల స్థూపం దగ్గర నివాళులు అర్పించారు. మహారాష్ట్ర నేలుతున్న పీష్వా రాజుల కుల దురహంకారాన్ని ఎదుర్కోవడానికి బహుజన వీరులు చేసిన వీరోచిత పోరాటమే భీమా కోరేగావ్ యుద్ధంగా చరిత్రలో నిలిచిపోయిందని పేర్కొన్నారు. బహుజన వీరుల పోరాటం ఆంగ్లేయుల కోసం కాదని ఆత్మాభిమానం, కులనిర్మూలన కోసమేనని వారు పేర్కొన్నారు. భారతదేశం పరాయి ప్రభువుల పాలు కావడానికి సహకరించిన కుల దురహంకారుల దౌర్జన్యాలు నేటికి సైతం కొనసాగుతున్నాయని, వాటిని బహుజనులందరూ ఐక్యంగా ప్రతిఘటించాలని పేర్కొన్నారు. భీమా కోరేగావ్ పోరాట స్ఫూర్తిని ఆ తర్వాతి కాలంలో కొనసాగించిన మహాత్మా పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన తోవలో అందరూ నడవాలని వారు సూచించారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి డూర్కె మోహన్, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు దేవి పోచయ్య, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర నాయకులు దుర్గం రామ్మూర్తి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ నీలకంఠేశ్వర్‌గౌడ్, మహాజన సమితి జిల్లా అధ్యక్షులు గొడిసెల దశరథం, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎడ్ల కిష్టయ్య, ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీమన్నారాయణ, దళిత నాయకులు దుర్గం స్వామి, ప్రదీప్ కుమార్, దుర్గం ఎల్లయ్య వివిధ దళిత బహుజన ప్రజాస్వామిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**జన్నారం :** భీమా కోరేగావ్‌లో పీష్వా బ్రాహ్మణ సైన్యంపై విజయం సాధించినందుకు జనవరి 1న విజయావోత్సవాలను జరుపుకుంటూ ఆ పోరాటంలో వీరమరణం పొందిన మహార్ సైనికులను స్మరించుకుంటూ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అమరవీరుల స్థూపానికి ఘన నివాళులు అర్పించి అన్నదానం చేశారు. దీనికి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్ హాజరై మాట్లాడారు. భీమా కోరేగావ్ యుద్ధ గాథల్ని స్మరించుకోవడానికి కార్యక్రమం నిర్వహించిందుకు అంబేద్కర్ సంఘ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. 500 మంది మహార్ వీరులు 28 వేల మంది పీష్వా సైన్యంతో మహారాష్ట్రలోని పూణే దగ్గర బీమా కోరేగావ్‌లోని భీమా నది వద్ద భీకర యుద్ధం చేసి 1818 డిసెంబర్ 27 నుంచి జనవరి 1న తెల్లారేసరికి విజయం సాధించారని తెలిపారు. అపార సైనిక బలగం కలిగిన పీష్వా రాజ్యంతో యుద్ధం చేయలేని బ్రిటిష్ వాళ్ల తమతో కలిసి పోరాడాలని మహర్లను కోరారని తెలిపారు. తిండి లేకుండా కాలినడకన వచ్చి మహార్ సైన్యం సింహంలా పీష్వా సైన్యాన్ని ఎదుర్కోవడాన్ని చూసి బ్రిటిష్ లెఫ్ట్‌నెంట్ కల్నల్ ఆశ్చర్యపోయారన్నారు. ప్రతి సంవత్సరం జనవరి 1న శౌర్య దివస్‌గా నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమాంలో కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ, అల్ ఇండియా అడ్వకేట్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పసుల రాజలింగం, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు బొర్లకుంట ప్రభుదాస్, మండల అధ్యక్షులు సిటిమల్ల భరత్, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ కుమార్, మాజీ జడ్పిటిసి ఎర్ర చంద్రశేఖర్ గుప్త నేతకాని, మహార్ కుల సంఘం రాష్ట్ర జేఏసీ నాయకులు తాళ్లపెల్లి రాజేశ్వర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్, జునుగురు మల్లేష్, తులసిపతి, జక్కుల సురేష్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికరం అశోక్, జాడి సుధాకర్ పాల్గొన్నారు.

**బోథ్ :** మండలంలోని సొనాల గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహార్ సంక్షేమ సంఘం అధ్వర్యంలో శౌర్య దివస్ సందర్భంగా అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ 1 జనవరి 1818 సంవత్సరంలో మహారాష్ట్రలో పీష్వాలు మహర్‌లను అంటరాని వారని, వారిపై యుద్ధం ప్రకటించగా 500 మహార్ సైన్యం 28000 పీష్వాలను ఓడించారని పేర్కొన్నారు. వారి వీరత్వానికి గుర్తుగా భీమా నది ఒడ్డున బ్రిటిష్ ఇండియా స్థూపాన్ని నిర్మించి అమరత్వం పొందిన వీరుల పేర్లను చెక్కించిందని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మొరుగు ప్రభాకర్, జాయింట్ సెక్రటరీ మునేశ్వర్ సోమన్న, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు అమృత్‌రావు పాటిల్, సంఘ సభ్యులు బొరిగెపు రాజారాం, బత్తుల రాములు, గడుగు ప్రభాకర్, మంచాల రాజేందర్ పాల్గొన్నారు.



బోథ్ :



జన్నారం :

## గాంధీ విగ్రహానికి ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినతి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. బుధవారం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ నేటికీ శాంతియుతంగానే మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ నిరసనలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో సమ్మెను ఉధృతం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూ స్పష్టమైన హామీ వచ్చేవరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. సమ్మెకు టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆరేపల్లి విజయ్ కుమార్ మద్దతు తెలిపి మాట్లాడుతూ డిమాండ్లు నెరవేరే వరకు పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘ సభ్యులు గంగాధర్, నరేష్, రాము, నవిత, గంగాధర్, ఆనంద్, సాయినాథ్, రమేష్, రాజు వర్మ రమణ, లక్ష్మీ, రజిత, నర్సయ్య, అపర్ణ, విమల, పుష్ప, లత, లతదేవి, జ్యోతి, వీణ పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



## భైంసాలో కొనసాగిన బంద్



నవతెలంగాణ-భైంసా

నాగదేవత ఆలయంలో చోరీ, విగ్రహాల ధ్వంసం ఘటనను నిరసిస్తూ బుధవారం పట్టణంలో వ్యాపార, వాణిజ్య సముదాయాలన్నీ బంద్ పాటించాయి. హిందూ ఆలయాలపై జరిగిన ఘటనలను నిరసిస్తూ హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛందంగా వ్యాపారులు తమ దుకాణాలను మూసి ఉంచారు. ఏఎస్పీ అవినాష్ కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు చేపట్టారు. ఆలయంలో జరిగిన ఘటనపై నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఏఎస్పీ వెల్లడించారు. శాంతి భద్రతల విషయంలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. అదే విధంగా నాగదేవత ఆలయాన్ని ఎమ్మెల్యే రామారావు పటేల్ సందర్శించి ఘటనపై ఆరా తీశారు. నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## భీమా కోరేగావ్ అమరులకు కంది జోహార్లు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భీమా కోరేగావ్ యుద్ధంలో అమరులైన 22 మంది మహార్ సైనికులకు జోహార్లు అర్పిస్తున్నామని, వారి ధైర్య సాహసాల గురించి దేశం గర్వంగా చెప్పుకుంటోందని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం భుక్తాపూర్‌లోని అశోక్ బుద్ధ విహార్‌లో జరిగిన భీమా కోరేగావ్ 206వ శౌర్యదివస్ మాన్ వందన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు సాంప్రదాయ పట్కా చుట్టి స్వాగతించారు. అమరుల స్థూపం వద్ద అంబేద్కర్ బుద్ధుని చిత్ర పటాలకు పూలలు వేసి నివాళ్లు అర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి అమరులకు నివాళ్లు అర్పించి జైభీం జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. హోంమంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరెత్తవద్దంటున్నాడని, దానికి బదులు దేవుడి పేరు తలిస్తే మంచిదని చెప్పడం ద్వారా అంబేద్కర్‌ను అవమానించినట్టేనన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. రిజర్వేషన్లు ఎత్తేసే ఆలోచన జరుగుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గాయకుడు, రచయిత, వక్త రెంజర్ల రాజేష్, భారతీయ బుద్ధ మహాసభ రాష్ట్ర కన్వీనర్ ప్రజ్ఞ కుమార్, సొగల సుదర్శన్, దిగంబర్ కాంబ్లే, రాజు మాస్కే, రాజు పాతడె, ఉదయ్ కుమార్ ఝూడే, రాహుల్ తాడే, ప్రమోద్ మూడే, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, పబ్లిక్ ప్రాసెక్యూటర్ మేకల మధుకర్, సాహెబ్‌రావు, ఇజ్జగిరి సంజయ్ కుమార్, నక్క రాందాస్, నాయకులు బూర్ల శంకరయ్య దాసరి ఆశన్న పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన యూత్ కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-బోథ్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గుడాల అనీష్ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా కలెక్టర్ సూచించినట్లుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు తమ వంతు సాయం చేసే విధంగా 100 హ్యాండ్ డిక్షనరీలు అందజేశారు. ఈ సందర్భంగా యువకులు సామాజిక దృక్పథంతో హ్యాండ్ డిక్షనరీ బుక్కులను అందజేసినందుకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, ఆదిలాబాద్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి, రాకేష్, గోడే అవినాష్, కిరణ్ ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పన ద్వారా పాఠశాలలను బలోపేతం చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా శాఖ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందడం వల్ల పేద విద్యార్థులకు లాభం చేకూరుతుందన్నారు. విద్యావకాశాలు మెరుగుపడడం ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. కిష్టన్న, వి.అశోక్, ఉపాధ్యక్షులు టి.సూర్యకుమార్, కార్యదర్శులు ఎ.స్వామి, ఎ.ఇస్తారి, సి.విలాస్, ఈ.శివన్న, కె.గణేష్, గౌస్ మొహియుద్దీన్, సోషల్ మీడియా కన్వీనర్ కె.శంకర్, జిల్లా కమిటీ సభ్యులు, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.



## అర్ధరాత్రి తాగిన మైకంలో ఆకతాయిల అల్లరి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మంగళవారం అర్ధ రాత్రి సమయంలో అనంతపేట్ గ్రామానికి చెందిన కొంత మంది ఆకతాయిలు నీలాయిపేట్‌లో అల్లరి చేశారు. గ్రామానికి చెందిన కొంత మంది పిల్లలు ప్రశాంతంగా నీలాయిపేట్ బస్టాండ్‌లో కొత్త సంవత్సరం వేడుకలు చేసుకుంటుండగా వారితో గొడవ పడ్డారు. తాగిన మైకంలో బస్టాండ్‌లో ఉన్న గాంధీ విగ్రహం దగ్గర బీడీలు, సిగరెట్లు పెట్టి అక్కడున్న జెండాలను ధ్వంసం చేశారు. ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆదేశాలతో బుధవారం సబ్ డివిజన్ ఏఎస్పీగా బాధ్యతలు తీసుకున్న రాజేష్ మీనా, నిర్మల్ రూరల్ సిఐ రామక్రిష్ణ, నిర్మల్ రూరల్ ఎస్ఐ లింబాద్రితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | జనవరి 02, 2025 | www.navatelangana.com



## విద్యార్థినులతో కలిసి కలెక్టర్ అల్పాహారం

నవతెలంగాణ-నిర్మల్



కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కేజీబీవీ విద్యార్థినులతో కలిసి బుధవారం ఉదయం కలెక్టర్ అభిలాష అభినవ్ అల్పాహారాన్ని స్వీకరించారు. విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. నూతన సంవత్సరంలో నూతన ఉత్సాహంతో ముందుకెళ్లాలని సూచించారు. విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి అభినందనలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అదిమూలం వెంకట్‌కు ప్రజా సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. నల్గొండలో మహాసభలు ముగిసిన అనంతరం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆయనను బుధవారం బాశెట్టి మాధవ రావు విజ్ఞాన కేంద్రంలో వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అభినందించిన వారిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, అగ్గిమల్ల స్వామి,జిల్లా కమిటీ సభ్యులు దర్శనాల నగేష్, ఆర్. సురేందర్, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోవె శకుంతల, లంక జమున, కోశాధికారి ఆర్.మంజుల, నాయకులు అడ్డూరి ఆశన్న, పంచాపూల, విజయ, పోచక్క ఉన్నారు.

## సెల్ఫీ విత్ సీఎం కార్యక్రమం చేపట్టి ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమగ్ర శిక్ష ఉద్యోగులకు సీఎం ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ బుధవారం సమగ్ర శిక్ష ఉద్యోగులు వినూత్న నిరసన తెలిపారు. వందలాదిగా తరలి వచ్చిన ఉద్యోగులు ఎన్టీఆర్ చౌక్‌లో సెల్ఫీ విత్ సీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం ఫ్లెక్సీ వద్ద సెల్ఫీ దిగారు. సీఎంకు ఎక్స్ ద్వారా సెల్ఫీ చిత్రాలను పంపించారు. ఉద్యమాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను విరమించి, ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపేలా స్పష్టమైన హామీ ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, జిల్లా అధ్యక్షురాలు ప్రియాంక డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు ధరమ్ సింగ్, పార్థసారథి, ప్రశాంత్ రెడ్డి, కేశవ్, దేవదర్శన్, వెంకటి, నవీన, మంగేష్ పాల్గొన్నారు.

## ఒప్పంద జీఓను విడుదల చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సివిల్ సప్లయ్ హామీలతో రాష్ట్ర కమిషనర్ గతంలో ఒప్పుకున్న రెట్ల ఒప్పంద జీఓను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలోని సివిల్ సప్లయ్ గోదాం వద్ద హామలీ కార్మికులు సమ్మె చేపట్టారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పూలమాలలు వేసి సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ సివిల్ సప్లయ్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. 2024 జనవరి 1న సివిల్ సప్లయ్ కమిషనర్‌తో హమాలీలు సమావేశం నిర్వహించి పలు ఒప్పందాలు చేశారన్నారు. రెట్ల పెంపుతో పాటు పలు సమస్యలపై జీఓను విడుదల చేస్తామని చెప్పి సంవత్సరం పూర్తి అయిన ఇంకా ఎలాంటి చర్యలు లేవన్నారు. కమిషనర్ తీరుకు వ్యతిరేకంగా నేడు హమాలీలు సమ్మె చేపట్టాల్సి వచ్చిందన్నారు. జీఓతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, డిప్యూటి ప్రధాన కార్యదర్శి గాజెంగుల రాజు, హామాలీ యునియన్ నాయకులు సలీం, మోసిన్, రాజేందర్, రమేష్, పొచ్చన్న ఉన్నారు.

## ప్రమాద రహింత డ్రైవింగ్ చేయాలి

● ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

ఆర్టీసీ డ్రైవర్లు ప్రమాద రహింత బస్సులను నడపాలని డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి అన్నారు. బుధవారం డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను ప్రారంభించారు. జనవరి 1 నుండి 31 వరకు ఈ మాసోత్సవాలు కొనసాగనున్నాయి. కాగా తొలి రోజు డిపో ప్రాంగణంలో ఏర్పాట్లు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ప్రమాదాలు ఎలా జరుగుతున్నాయి, ఇప్పటి వరకు ప్రమాదాలు ఎలా జరిగాయి, వాహనాలను ఎలా ఓవర్ టేక్ చేయాలి, మూల మలుపుల దగ్గర ఎలా అప్రమత్తంగా ఉండాలని పవర్ పాయింట్, వీడియోలను ప్రాజెక్టర్ ద్వారా చూయించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి మాట్లాడుతూ ప్రజా రవాణలో పని చేస్తున్న వారు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. తమపై ప్రయాణికులు నమ్మకంతో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నారన్నారు. అతివేగంగా అజాగ్రత్తగా వాహనాలు నడుపొద్దని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, విజిలెన్స్ అధికారి ప్రభుదాస్, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరషన్ 2025 క్యాలెండర్‌ను ఫెడరేషన్ నాయకులు ఆవిష్కరించారు. బుధవారం పట్టణంలోని కుమురం భీం చౌక్‌లో నాయకులు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యవ్యవస్థలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యను పరిష్కరించాలన్నారు. విద్యారంగానికి 30శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు సుధాకర్, వృకోధర్, సాయికాంత్, శ్రీనివాస్, నారాయణ్, కిషోర్ ఉన్నారు.

# ఘనంగా భీమాకోరేగావ్ విజయ్ దివస్



నిర్మల్ : అంబేద్కర్ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న బుద్ధ విహార్ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-నిర్మల్

బుద్ధ విహార్ కమిటీ ఆధ్వర్యంలో విజయ్ దివస్‌ను బుధవారం జిల్లా కేంద్రంలో బుద్ధ విహార్‌లో ఘనంగా నిర్వహించారు. భీమకోరేగావ్ యుద్ధంలో అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించి కుల అహంకార పీష్వా సైన్యాలను ఓడించిన మహార్ సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో బుద్ధ విహార్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుంటోల్ల వేంకట స్వామి, మధుకర్ మునేశ్వర్, సభ్యులు మురళీ, క్రాంతికిరణ్, సంజీవ్, భగత్ నారాయణ, మధు, భీమన్న, గంగన్న, నరేష్ పాల్గొన్నారు.

**నార్నూర్ :** 206వ శౌర్య దినోత్సవాన్ని బుధవారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌక్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, మాజీ జెడ్పీటీసీ బ్రిజులాల్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుల వివక్షతకు వ్యతిరేకంగా మహారాష్ట్రలోని భీమా కోరేగావ్ గ్రామంలో సంఘటన వీరత్వానికి ప్రతిరూపమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవరావ్ లోఖండే, బాలాజీ కాంబ్లే, ఫ్యాక్స్ డైరెక్టర్ కాంతారావ్ దుర్గె, చాలుర్కర్ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి మోతీరాం, లోఖండే చంద్రశేఖర్, బౌద్ధ ఉపాసకులు పాల్గొన్నారు.

**ఆదిలాబాద్ రూరల్:** మావల మండలం కుమురం భీం కాలనీలో భీమా కోరేగావ్ యుద్ధ విజయోత్సవ దినోత్సవాన్ని తుడుం దెబ్బ మావల మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షులు గోడం గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, స్వయం సుమన్ బాయి, రైతు సంఘం డివిజన్ ఉపాధ్యక్షులు మెస్రం తులసిరామ్, నాయకులు గోవింద్ రావు, మానుకుబాయి పాల్గొన్నారు.



నార్నూర్: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఆదిలాబాద్ రూరల్ : కోరేగావ్ స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

# ఆదిలాబాద్‌ను ముందు వరుసలో ఉంచుతాం

● కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్క లబ్దిదారుడికి ప్రభుత్వ పథకాల అమలులో జిల్లాను ముందు వరుసలో ఉంచుతామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో 2025 సంవత్సర శుభాకాంక్షలను అధికారులు ఆయనకు తెలియజేశారు. కలెక్టర్ సూచన మేరకు బుక్స్, బ్లాంకెట్స్ అందిస్తు నూతన సంవత్సరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కోటపరందోలిలో జనవరి రెండవ తేది నుంచి నిర్వహించే జంగుబాయి ఉత్సవాల పోస్టర్లను నిర్వహణ కమిటీ సభ్యులు సలాం శ్యాంరావ్, మరప బాజీరావు, కోడప జకులతో కలిసి విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో అందరికి మంచి జరాగాలన్నారు. యువత మంచి దిశగా వెళ్లడంతో పాటు పిల్లలు భవిష్యత్తుపై దృష్టి సారించాలన్నారు. అలాగే 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. తన పిలుపు మేరకు అధికారులు, జిల్లా ప్రజలు సామాజిక బాధ్యతగా బుకేకు బదులుగా బుక్స్, బ్లాంకెట్స్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. అవసరమున్న వారికి ఇవి ఉపయోగపడుతాయన్నారు. సమాజంలో విద్య చాలా ముఖ్యమని అందుకే అవసరమున్న వారికి నోట్ బుక్స్, మహనీయుల జీవిత చరిత్రలు తెలియజేసే మంచి పుస్తకాలు మార్గదర్శనం చేయడానికి ఉపయోగపడుతాయని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు.

# ఆంగ్ల సంవత్సరంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆంగ్ల సంవత్సరంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఎమ్మెల్యే పాయల శంకర్ ఆకాంక్షించారు. బుధవారం శాంతినగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి పుష్పగుచ్చాలు అందించి నూతన సంత్సవరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్టీయూ సంఘం నూతన క్యాలెండర్‌తో పాటు డైయిరీని ఆవిష్కరించారు. అనంతరం ఆయా సంఘాల నూతన క్యాలెండర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సాధనలో కీలకంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు ఈ సంవత్సరంలో పరిష్కరం కావాలన్నారు. దీని కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. అదే విధంగా జిల్లా, నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేసేల తన వంతు యెకృషి చేస్తానన్నారు. ఇదిలా ఉంటే సరస్వతి శిశుమందిర్‌లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ సనాతన హిందూ ఉత్సవ సమితి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి స్వీట్లు తినిపించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ ఖత్రి, గౌరవ అధ్యక్షుడు బండారి వామన్, ప్రధాన కార్యదర్శి మహాదవ్, రేణికుంట్ల రవీందర్, సుభాష్, టీఎన్జీఓస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, నవీన్, ఎస్టీయూ నాయకులు రవీరంద్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

**కంది భవన్‌లో..**

పట్టణంలోని ప్రజాసేవ భవన్ లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డికి ప్రజలు, పార్టీ శ్రేణులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలు సంతోషంగా ఉండి, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ఇప్పటికే ప్రజాపాలన ద్వారా ప్రజల విశ్వసనీయత పొందిన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మరింత మెరుగైన పాలన అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**కడెం :** ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను ఉట్నూర్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో బుధవారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు గొల్ల వెంకటేష్, పీఏసీఎస్ సింగిల్ విండో డైరెక్టర్ పడిగెల భూషణ్, మండల సీనియర్ నాయకులు తాళ్లపెల్లి రమేష్, రాజేశ్వర్ రెడ్డి, ఎస్.రాజన్న ఉన్నారు.

**ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు**

**నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సరం పురస్కరించుకొని కేక్ కటింగ్ చేసి ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. జిల్లా అధ్యక్షులు సయ్యద్ హైదర్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు అబ్దుల్ సాదిక్, జహీర్, వినోద్ పాల్గొన్నారు.

**నార్నూర్ :** మండలంలోని ఆయా గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను బుధవారం యువకులు చిన్నారులు ఘనంగా నిర్వహించారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలికి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థులు కేక్ కట్ చేసి ఒక్కరినోకరు శుభాకాంక్షలు తెలిపారు.

# విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఇటీవల రిటైర్ట్ అయిన ఉద్యోగులను శాలువతో సత్కరించారు. అనంతరం తెలంగాణ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ వివిధ శాఖల్లో పని చేసి విశ్రాంతి పొందిన వారిని సత్కరించడం జరిగిందన్నారు. ప్రభుత్వం వద్ద చాలా రోజుల నుంచి వీరి సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పీఆర్సీ, వెల్నెస్ సెంటర్‌లో చికిత్సలు, నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. శేషజీవితంలో సుఖంగా ప్రశాంత ఉండలంటే వారి సమస్యలు, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శశికాంత్, కార్యదర్శి జగన్మోహన్, గౌరవ అధ్యక్షుడు దయాకర్ రెడ్డి, పురుషోత్తం, మస్తన్, జిలానీ, అశోక్ వైద్య, బీఆర్ఎస్ నాయకులు రమేష్ పాల్గొన్నారు.

## ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాజేష్ మీనా

నవతెలంగాణ-నిర్మల్



నిర్మల్ ఏఎస్పీగా నూతనంగా రాజేష్ మీనా బుధవారం సబ్ డివిజన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ డా.జి.జానకి షర్మిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ సమస్యలపై చర్చించారు. కాగా రాజస్థాన్‌కు చెందిన ఏఎస్పీ రాజేష్ మీనా ఐఐటీ జోద్పూర్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేసారు. 2022లో సివిల్స్‌లో ఐపీఎస్‌గా సెలెక్ట్ అయ్యారు. ట్రైనింగ్ పూర్తి చేసుకుని గ్రేహౌండ్‌లో దళ కమాండర్‌గా విధులు నిర్వర్తించి, ప్రస్తుతం నిర్మల్ సబ్ డివిజన్ ఏఎస్పీగా నియమితులయ్యారు.

## సామాజిక న్యాయం కోసం మాలీలు ఏకం కావాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

24 సంవత్సరాలుగా మాలీకులస్తులు సామాజిక న్యాయం కోసం అనేక పోరాటాలు చేశారని అయిన పూర్తిస్థాయిలో సామాజిక న్యాయం లభించలేదని దానికోసం ఏకం కావాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 12న ఆసిఫాబాద్ జిల్లాలో మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలు జరగనున్నాయని దానికోసం ఓటర్లుగా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 250 గ్రామాల్లో నివసిస్తున్న మాలీ పెద్దలు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి ఇద్దరు ఓటర్లు ఓటు వేసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకుంటారన్నారు. అలాగే జనవరి మూడో తేదీన భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు జ్యోతి సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన జరుపుకునీ విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, పటేల సంఘం జిల్లా అధ్యక్షులు షిండే గంగారం, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఉమేష్ రావు డోలే, జిల్లా కార్యవర్గ సభ్యులు విట్టల్ కొత్రంగే పాల్గొన్నారు.

## నేడు మెగా రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని పిట్టబొంగరం గ్రామంలో గురువారం ఆదివాసీ యూత్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు మెస్రం శేఖర్ తెలిపారు. శిబిరంలో యువకులు, దాతలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేలా పోటీలు

● మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేలా బీఆర్ఎస్ తరపున పోటీలు నిర్వహిస్తున్నట్టు మాజీ మంత్రి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బుధవారం ఆయన రూరల్ మండలంలోని రాజుగూడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచాయం చేసుకొని కొంత సెపు బ్యాటింగ్ చేసి ఉత్సహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఎందరో మంది ఉన్నారన్నారు. ఇటువంటి పోటీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నికల్లో గెలుపోటములకు సంబంధం లేకుండా పేదల పక్షాన నిలబడుతూ వారికి ఎల్లవేళలా అండగా నిలుస్తున్నామన్నారు. ముందుగా గ్రామానికి వచ్చిన అతిథులకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పటేల్ సిడాం బాబురావు, మెట్టు ప్రహ్లాద్, మాజీ ఎంపీపీ గంద్రత్ రమేష్, సేవ్వా జగదీష్, రాజు, పరమేశ్వర్, అప్కామ్ గంగయ్య, సుదర్శన్, గేడం రాము పాల్గొన్నారు.

## రేపు బయల్దేరనున్న నాగోబా జాతర ప్రచారం రథం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గిరిజనుల ఆరాధ్య దైవం రాష్ట్రంలోనే సమక్క సారక్క తరువాత రెండవ అతి పెద్ద జాతరగా పేరు గాంచిన కేస్లాపూర్ నాగోబా జాతర ఈ నెల 28న ప్రారంభం కానుంది. ఈ జాతర ఆరంభానికి ముందు నెల రోజుల నుంచే మేస్రం వంశీయులు సన్నద్ధమవుతారు. శుక్రవారం నాగోబా జాతర నిర్వహణపై మురాడి వద్ద వివిధ గ్రామాల నుంచి వచ్చిన మేస్రం వంశీయులు సమావేశమవుతారు. అక్కడ వారి ఆచార సాంప్రదాయం ప్రకారం పూజలు చేసినంతరం ప్రచార రథం( ఛకడా) బయల్దేరుతుంది. సిరికొండ, ఇచ్చోడ మండలంలోని వివిధ గ్రామాల్లో బసచేస్తూ నాగోబా జాతర ఆరంభంపై ప్రచారం నిర్వహించి తిరిగి కేస్లాపూర్‌కు చేరుకోవడం ఆనాదిగా వస్తున్న ఆచారం.

## పట్టుబడిన పెద్ద పులి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మహారాష్ట్ర తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో రెండు నెలల నుండి ఇరు రాష్ట్రాల ప్రజలను భయాందోళనకు గురిచేసిన పెద్దపులిని అటవీ అధికారులు పట్టుకున్నారు. సిర్పూర్, మహారాష్ట్రలోని అంతర్గాం సరిహద్దు ప్రాంతంలో మహారాష్ట్ర అడవి శాఖ సిబ్బంది మత్తుమందు ఇచ్చి బోనులో బందించారు. అక్కడి నుంచి మహారాష్ట్రలోని చంద్రపూర్ పులుల సంరక్షణ కేంద్రానికి తరలించారు. పట్టుబడిన పెద్దపులి మగ పులిగా గుర్తించినట్టు సమాచారం. కొన్ని రోజుల నుండి మనుషులు, పశువులపై దాడి చేసిన పులి ఇదేనా అని నిర్ధారించడానికి పులికి సంబంధించిన ఆనవాలను పరిశీలన కేంద్రానికి పంపించినట్టు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు. పులిని పట్టుకోవడంతో రైతులు, ప్రజలు ఊపిరిపిల్చుకున్నారు. ఇదే దారిలో పులి సంచారించడంతో వేటగాళ్ల దృష్టి పడే ప్రమాదం ఉండడంతో ఇరు రాష్ట్రాల అటవీ శాఖ అధికారులు చకచక్యంగా వ్యవహరించి దాదాపు వారం రోజులుగా శ్రమించి పులిని ఎట్టకేలకు బోనులో బంధించి చంద్రాపూర్ తరలించారు.

## జోడేఘాట్‌కు సందర్శకుల తాకిడి

నవతెలంగాణ-కెరమెరి



నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు ప్రకటించింది. బుధవారం పాఠశాలలకు సైతం సెలవు దినం కావడంతో సందర్శకులు జోడే ఘాట్‌కు పోటెత్తారు. జోడేఘాట్‌లోని మ్యూజియం సందర్శకులతో సందడిగా మారింది. అనేక ప్రాంతాల నుంచి సందర్శకులు ప్రత్యేక వాహనాలతో తరలివచ్చారు. మ్యూజియంలో రోజంతా చిన్నారులు కేరింతలతో కాలక్షేపం చేశారు. సాయంకాలం సందర్శకులు తిరుగు ప్రయాణమయ్యారు.

## అటవీ కేసుల పరిష్కారానికి సరైన విధానం పాటించాలి

- జిల్లా జడ్జి ఎంవీ రమేష్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అటవీ కేసుల పరిష్కారం కోసం సిబ్బంది నిర్దిష్టమైన విధానాన్ని పాటించాలని జిల్లా జడ్జి ఎంవీ రమేష్ అన్నారు. కాగజ్‌నగర్‌లోని వేంపల్లి టింబర్ డిపో ఆవరణలో సిబ్బందితో అటవీ కేసుల పరిష్కారానికి సంబంధించి జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి యువరాజ, జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్ష్మితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ జంతువుల వేటాడడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారికి త్వరగా శిక్ష పడే విధంగా నిర్దిష్టమైన విధానాన్ని పాటించాలన్నారు. కోర్టు సిబ్బంది ఎప్పటికప్పుడు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. త్వరగా కేసుల పరిష్కారం కోసం సిబ్బంది అవసరమైన సాక్ష్యాలను త్వరితగతిన ప్రవేశపెట్టాలన్నారు. అనంతరం వేంపల్లి పరిధిలో చేసిన అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఎఫ్‌డీఓ, జిల్లాలోని వివిధ రేంజ్ అధికారులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికుల సమ్మె ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పెరిగిన సివిల్ సప్లయ్ హమాలీ రేట్ల జీఓను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సివిల్ సప్లయ్ జిల్లా గోదాంల ఎదుట నిరసన దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్టుపల్లి సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ ఏప్రిల్ 10న కార్మికులకు ప్రభుత్వానికి జరిగిన ఒప్పందాన్ని వెంటనే అమలు చేస్తూ హమాలీ రేట్లు పెంచాలన్నారు. అప్పటి వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రేట్లు పెంచడానికి సంబంధించిన జీఓ వెంటనే విడుదల చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు పెంచాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఇతర డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనివాస్, తుకారం, మోహన్, కొమురక్క పాల్గొన్నారు.

## క్లబ్ సేవలనుమరింత విస్తరిస్తాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా వ్యాప్తంగా వాసవి క్లబ్ సేవలను మరింత విస్తరిస్తామని నూతనంగా ఎంపికైన క్లబ్ అధ్యక్షుడు పాత శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని స్థానిక వాసవి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. క్లబ్ సేవలు క్షేత్రస్థాయిలో తీసుకెళ్లేందుకు క్లబ్ సభ్యులు సహకరించాలని కోరారు. అదేవిధంగా క్లబ్ సేవలను జాతీయ స్థాయిలో తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరం కలిసి కట్టుగా పనిచేసి ముందుకు సాగుదామన్నారు. 2025 సంవత్సరానికి గాను ఎంపికైన వాసవి క్లబ్ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్ అధ్యక్షుడిగా పాత శ్రీనివాస్, కార్యదర్శిగా ముక్క కృష్ణమూర్తి, కోశాధికారిగా కిషోర్‌తో వాసవి క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు ఎకిరాల శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అంతర్జాతీయ సభ్యులు గంధం శ్రీనివాస్, చిలువేరి వెంకటేశ్వర్, గుండా ప్రమోద్, గుండా బాలేష్, కోడిప్యాక వేణుగోపాల్, ముక్తా సురేష్, మాజీ క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## సన్మార్గంలో నడవాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సమాజంలో మానవ సంబంధాలు, జ్ఞానం పెంపొందించుకోవడమే ప్రవక్త చూపిన మార్గమని నూతన సంవత్సరంలో ప్రవక్త బోధనలపై నడవడమే ఆయనకు ఇచ్చే దక్షిణ అని చర్చి పాస్టర్లు కీర్తి కుమార్, ఫిలిప్ సూచించారు. బుధవారం నూతన సంవత్సరం పురస్కరించుకొని చర్చలలో ప్రవక్త చెప్పిన ప్రవచనాలను భక్తులకు బోధించారు. మనుషుల మధ్య ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండాలన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పేద కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నూతన సంవత్సరానికి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేస్లాపూర్ ఆలయంలో అర్చకుడు శిరీష్ శర్మ, శ్రీనివాస శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా, సాయిబాబా ఆలయంలో మధుకర్ శర్మ, రామాలయంలో ఆలయ పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్‌డీపీఓగా చిత్తరంజన్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్




జిల్లాకు బదిలీపై వచ్చిన ఐపీఎస్ అధికారి చిత్తరంజన్ ఆసిఫాబాద్ ఎస్‌డీపీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం అన్ని చర్యలు తీసుకుంటానని తెలిపారు. పోలీసుల సమస్యల పరిష్కారం కోసం కూడా కృషి చేస్తానని వివరించారు. అనంతరం ఎస్పీ డీవి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు.

# నూతన సంవత్సర వేడుకల్లో ప్రముఖులు

- క్యాలెండర్ల ఆవిష్కరణలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



నూతన సంవత్సర 2025ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించగా పలువురు ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో పాటు పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డీవీ.శ్రీనివాసరావుకు, జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్‌కు ఆయా శాఖల సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛి అందజేశారు. పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘంతో పాటు పలు క్యాలెండర్లను కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఆవిష్కరించారు.



**ఎమ్మెల్యే నివాసంలో**

జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి నివాసంలో ఆమెను కలిసి పలువురు శుభాకాంక్షలు తెలుపగా, నియోజకవర్గ ప్రజలకు ఆమె నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పలు సంఘాల క్యాలెండర్లు ఆవిష్కరించారు.

**వాంకిడి :** మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నూతన సంవత్సరాన్ని స్థానికులు ఘనంగా జరుపుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కేకులు కట్ చేసి ఒకరికొకరు తినిపిస్తూ హ్యాపీన్యూయర్ అని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఎలాంటి సంఘటనలు జరగకపోవడం సంతోషంగా ఉందని ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు




నవతెలంగాణ-కాగజ్‌నగర్

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని సిర్పూర్ ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు అన్నారు. సర్‌సిల్క్‌కాలనిలోని తన కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ 2025 డైయిరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించడంలో తమ వంతు బాధ్యతను నిర్వహించాలని, నిరంతరం విద్యాభివృద్ధి, సమాజాభివృద్ధికి పాటుపడాలని కోరారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలతో ప్రతి టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయుడు విద్య, సమాజాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల, 317 జీఓ బాధిత ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, రాబోయే బడ్జెట్లో విద్యారంగానికి 15 శాతం నిధులను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ఎల్ ప్రీతి, జిల్లా కార్యదర్శి యం రాజకమలాకర్‌రెడ్డి, కాగజ్‌నగర్ మండల అధ్యక్షులు జుట్టు మహిపాల్, మండల బాధ్యులు రంజిత్‌రాజ్, సురేష్‌కుమార్, నాయకులు సమతకుమారి, విజయ్ పాల్గొన్నారు.

# కొత్త సంవత్సరంలోనైనా సమస్య పరిష్కారం కావాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



నూతన సంవత్సరంలోనైనా తమ సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా 22 రోజులుగా చేస్తున్నారు. సమ్మెలో భాగంగా నూతన సంవత్సరం పురస్కరించుకునే నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 10వ తేది నుండి సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్‌లను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సమ్మె ప్రభావంతో రాష్ట్రం అంతా కేజీబీవీ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో 10 రోజులుగా విద్యార్థులు బోధన అందటం లేదని, ఎమ్మార్సీలో ఏంఐఎస్‌లు, సీసీఓలు మెసెంజర్లు సమ్మెలో పాల్గొనడంతో రాష్ట్రం అంతటా ఎమ్మార్సీలు మూతబడి ఉన్నాయన్నారు. ఐఈఆర్పీలు సమ్మెలో ఉండటంచే భవిత సెంటర్లు మూతబడి ప్రత్యేక అవసరాలు గల పిల్లలు చదువుకు దూరం అయ్యారన్నారు. కాంప్లెక్స్ స్థాయిలో క్లస్టర్ రిసోర్స్ సమ్మెలో ఉండటంతో పాఠశాల రిపోర్ట్స్ అన్ని పెండింగ్ ఉన్నాయన్నారు. పాఠశాలలలో పనిచేసే పీటీఐలు సమ్మెలో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు ఆర్ట్ క్రాఫ్ట్ వ్యయామ విద్యకు దూరమవుతున్నారన్నారు. 23 రోజులుగా చేస్తున్న సమ్మె విరమణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా నేడు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న శాంతియుత ర్యాలీ జయప్రదం చేయాలన్నారు. 23వ రోజు సమ్మెకు పీఆర్టీయూ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, అనిల్, నాయకులు ఉదయ్‌బాబు, భరత్, శ్రావణ్, భిక్షపతి మద్దతు తెలుపగా ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు నాగేష్, సందీప్, అనూప్, అరుణ, మీనా, నాగసుద, స్వప్న, అన్నపూర్ణ, చైతన్య, మోహన్, భూమన్న పాల్గొన్నారు.

# ఘనంగా భీమా కోరేగావ్ దినోత్సవం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సమత సొసైటీ, ద బుద్ధిష్టి సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మీరాతాయి దీక్ష భూమిలో శౌర్య దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శూద్రుల ఆత్మ గౌరవం కోసం జరిగిన యుద్ధంలో 28 వేల మంది పేష్వా బ్రాహ్మణుల సైన్యాన్ని కేవలం 500 మంది మహర్ సైనికులు ఊచకోత కోసి విజయం సాధించి చరిత్ర సృష్టించారన్నారు. ఈ పోరాట గాథను స్ఫూర్తిగా తీసుకుని బహుజనులంతా ఏకమై రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని సమతా సొసైటీ అధ్యక్షులు దుర్గం జనార్ధన్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సునీల్ డోంగ్రీ, సొసైటీ సభ్యులు తిరుపతి, డా.టెమాజి, సుక్ దేవ్, సంతోష్, మోహన్, రామచందర్, పండరినాథ్, విస్తారు, శుభాకర్, భగవాన్ పాల్గొన్నారు.

**వాంకిడి :** భీం కొరెగావ్ శౌర్య దినోత్సవాన్ని బుధవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ ఈశ్వల రాజ్యంలో జీవిస్తున్న దళితులు ఈశ్వలకు తమ సేవలను అందించినప్పుడు వారు అంటరానివరి అనే లైబిల్‌తో తిరస్కరించినందున ఇది మహర్ ఆత్మగౌరవం కోసం కోరేగావ్ యుద్ధం జరిగిందన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, సిద్ధార్థ్ యువజన సంఘం నాయకులు, మహిళ మండలి నాయకులు పాల్గొన్నారు.



## టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి, నాణ్యమైన విద్యను అందించి వారి సంపూర్ణ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. పాఠశాలలో సమాజ భాగస్వామ్యాన్ని అనుసంధానం చేస్తూ సామాజిక స్పృహతో పని చేయాలని, నవ సమాజ నిర్మాణం తరగతి గదిలోనే ప్రారంభం అవుతుండడంతో ఉపాధ్యాయుల బాధ్యత చాలా కీలకమన్నారు. ఒక సామాజిక స్పృహ కలిగిన సంఘంగా నూతన సంవత్సరంలో నవ ఉత్తేజంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కంపెల్లి ఊసన్న, జిల్లా ఉపాధ్యక్షులు సోయం ఇందురావ్, హేమంత్ షిండే, సమ్మయ్య, సుభాష్ మీనా కుమారి, అన్నపూర్ణ, లీలాబాయి, అనిత, హరీష్, కిరణ్ కుమార్, ఆరిఫ్, జమీల్, సుధాకర్, రాజలింగు, పృథ్వి, కేశవరావు, రవి, సుధాకర్, సుశీల్ పాల్గొన్నారు.

## హెచ్‌ఎంపై దాడి చేసిన వారిని శిక్షించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

కొన్నిరోజుల క్రితం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంబాలపల్లి రాములుపై దాడి చేసిన వారిని శిక్షించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బాధిత ఉపాధ్యాయునికి మద్దతు ప్రకటిస్తున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతి కుమారి అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకి ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తగ్గిపోతుండటం అనేది సమాజ పతనానికి నిదర్శనంగా చెప్పవచ్చన్నారు. నేటి సమాజంలో పిల్లల్లో నేరప్రవృత్తి పెరగడం లైంగికదాడులు దిగజారుతున్న మానవ సంబంధాలు వీటన్నిటికీ కారణమని, విద్యా బుద్దులు నేర్పించే పాఠశాలలోకి మతాన్ని దేవుణ్ణి చొప్పించి పాఠశాల వాతావరణాన్ని కలుషితం చేసే ప్రయత్నాలు ఉద్దేశపూర్వకంగానే జరుగుతున్నట్టుగా అనుమానాలు కలుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుభాష్, మహిపాల్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరీష్, బాజీఖాన్, మండల నాయకులు శ్రీనివాస్, జహీర్, సందీప్, పద్మ, రేణుక పాల్గొన్నారు.

## భీం స్మారక క్రికెట్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని సులుగుపల్లి గ్రామంలో కుమురం భీం స్మారక క్రికెట్ పోటీలను పీటీడీఏ ఉపాధ్యక్షులు కార్పేత రమేష్ బుధవారం ప్రారంభించారు. మండలంలోని 22 క్రికెట్ జట్లు వచ్చినట్లు క్రీడల నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో సులుగుపల్లి మాజీ ఉపసర్పంచ్ సంతోష్, గ్రామస్తులు రామయ్య, కరపత రామయ్య, మనోహర్, ఫకీర్, తలండి మల్లేష్, నైతం చిన్నయ్య, సంతోష్, పురుషోత్తం, కళ్యాణ్ పాల్గొన్నారు.

## ఉత్పత్తి ఉత్పాదికతపై జీఎం సమీక్ష

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎమ్.శ్రీనివాస్ అధ్యక్షతన జీఎం కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో అన్ని విభాగాల అధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియాలోని ఉత్పత్తి, ఉత్పాదికత, లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలను, నూతన సంవత్సరంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను చర్చించి అందరికీ దిశ నిర్దేశం చేశారు. యంత్రాల వినియోగం, లక్ష్య సాధనకు అన్ని విభాగాల మధ్య సమన్వయం ఉండేలా చూసుకుని మెరుగైన పని తీరును ప్రదర్శించి సత్ఫలితాలు రాబట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రాజమల్లు, ఖైర్‌గూడ పీఓ నరేందర్, డీజీఎం సెక్యూరిటీ ఉమాకాంత్, డీజీఎం(ఐఈ) బెహర పర్సనల్ మేనేజర్ తిరుపతి, గొలెటి సీహెచ్‌పీ హెచ్‌ఓడీ కోటయ్య, ఏరియా హాస్పిటల్ డిప్యూటి సీఎంఓ మధు కుమార్, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## రేపు 3న బహిరంగ విచారణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

షెడ్యూల్డ్ కులముల ఉప వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమీషన్ ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి డా.షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో ఈ నెల 3న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బహిరంగ విచారణ నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల అభిప్రాయాలను బహిరంగ విచారణలో స్వీకరించడం జరుగుతుందని, ఈ నెల 3న ఉదయం 11 గంల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగనున్న బహిరంగ విచారణలో జిల్లాలోని అన్ని ఎస్సీ కులాల సంఘాల ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలు, వినతులు సమర్పించవచ్చని తెలిపారు.

## నూతనోత్తేజంతో పనిచేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కొత్త సంవత్సరంలో అటవీ సంరక్షణలో నూతనోత్తేజంతో సిబ్బంది పని చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ తెలిపారు. అటవీ శాఖ సిబ్బంది అసోసియేషన్ క్యాలెండర్ డైయిరీని సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంరక్షణలో సిబ్బంది కొత్త ఉత్తేజంతో పనిచేయాలన్నారు. సిబ్బంది సమస్యలు ఏవైనా తన దృష్టికి నేరుగా తీసుకురావచ్చని సూచించారు. వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ అటవీ రేంజ్‌ల అధికారులు గోపీచంద్ సర్దార్, శ్రీనివాస్, నిజాముద్దీన్, మజారుద్దీన్, జ్ఞానేశ్వర్, జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ ఆసిఫాబాద్ అధ్యక్షుడు యోగేష్, సంఘం నాయకులు సద్దాం, అనిల్, స్వప్న పాల్గొన్నారు.

## నేడు నాలుగో తరగతి ఉద్యోగుల సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ గిరిజన శాఖలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు రామచందర్, పోచం, చిరంజీవి, రవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పీఎంహెచ్ బాలికల పాఠశాలలో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనునట్టు ఈ సమావేశానికి ఐటీడీఏ పీఓ కుష్భూగుప్తాతో పాటు గిరిజన శాఖ ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు. గిరిజన శాఖలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ పొడిగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, జిల్లాలో ప్రశాంతతను పెంపొందించేందుకు జిల్లా అంతటా జనవరి 1 నుండి జనవరి 31 వరకు పోలీస్ యాక్ట్ 1861 అమల్లో ఉంటుందని ఎస్పీ డీవీ. శ్రీనివాసరావు ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగ్, ఊరేగింపులు, ధర్నాలు చెయొద్దన్నారు. నిషేదిత ఆయుధలైన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగోల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదన్నారు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్‌లు, జనసమూహం పోగవ్వడం వంటివి నిషేధమన్నారు. జిల్లాలో 30 యాక్ట్ అమల్లో ఉన్నందున నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే ఈ నియమ నిబంధనలు విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, మిలిటరీ అధికారులు, హోంగార్డ్స్, అంత్యక్రియ ఊరేగింపులకు అనుమతి అవసరం లేదన్నారు.

## రాష్ట్రంలో రాక్షస పాలన పోయి ప్రజా పాలన వచ్చింది

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్



నవతెలంగాణ-జైపూర్

రాష్ట్రంలో కొనసాగిన రాక్షస పాలన నుంచి ప్రజలు విముక్తి పొంది ప్రజా పాలన కొనసాగుతుందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. నియోజకవర్గం ప్రజలకు సోషల్ మీడియా వేదికగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మేలు చేకూర్చే దిశగా అనేక పథకాలు తీసుకువచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాబోవు రోజులు మరిన్ని పథకాలు అమలు చేయనుందని అన్నారు. రైతు భరోసా ఇందిరమ్మ ఇండ్లు పంపిణీకి ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టిందని అన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు అన్ని అమలు చేసి తీరుతుందని అన్నారు. గతంలో పోలీస్ జులుం ఉండేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా పాలన కొనసాగుతుందని అన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన ప్రసాద్ నేత

నవతెలంగాణ-జన్నారం



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కలవకుంట్ల తారక రామారావును బుధవారం జన్నారం మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన నేతకాని మహర్ విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసాద్ నేతకు పలు సూచనలు చేశారు. ఖానాపూర్ నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేయడానికి కృషి చేయాలని కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాలని కోరారు. ప్రజలకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుంది అన్నారు.

## శ్రీరాంపూర్ ఏరియాలో 114 శాతం బొగ్గు ఉత్పత్తి




నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో డిసెంబర్ నెలలో 114 శాతం బొగ్గు ఉత్పత్తి అయిందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ తెలిపారు. బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంతో పోల్చి చూస్తే ఉత్పత్తి రికార్డు స్థాయిలో సాధించినట్లు తెలిపారు. అలాగే ఎప్పుడూ లేని విధంగా ఒక్కరోజులో భూగర్భ గనులలో ఉత్పత్తి రికార్డు స్థాయిలో 5,578 ఉత్పత్తి సాధించామని, మొత్తంగా ఒక రోజులో 28,509 ఉత్పత్తి సాధించి రికార్డు సృష్టించినట్లు తెలిపారు. అంతేకాకుండా గత నెలలో రక్షణ పక్షోత్సవాలు నిర్వహించామని, కార్మికులకు రక్షణ ఉత్పత్తి సాధన అవగాహన కల్పించామని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించి ఉత్పత్తి అధిగమించే దిశగా పయనిస్తున్నామని పేర్కొన్నారు. నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని అధిగమిస్తామని అన్నారు. డిసెంబర్ నెలలో 589 ప్రమోషన్లను ఇచ్చామని, ఇప్పటి వరకు 350078 మందికి కారుణ్య నియామక పత్రాలు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేత



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనిలో నవంబర్ నెలలో ఎక్కువ ఉత్పత్తి కోసం కృషిచేసిన ఉద్యోగులను బుధవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఉత్పత్తికి కృషి చేసిన పలు డిసిగ్నేషన్స్ ఎస్డీఎల్ ఆపరేటర్స్, కోల్ కటర్స్, షాట్ఫైర్, సర్దార్ ఉద్యోగులని సత్కరించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ తిరుపతి, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కందికట్ల వీరభద్రయ్య మాట్లాడుతూ ఆర్కే-7 గని నవంబర్ నెలలో ఉత్పత్తి సాధనలో ప్రతి ఒక్క కార్మికుని కృషి ఉందని, రానున్న మూడు నెలల్లో ఇదేవిధంగా రక్షణ సూత్రాలు పాటిస్తూ 100 శాతం ఉత్పత్తి సాధించి శ్రీరాంపూర్ ఏరియాలోనే ఉత్తమ గనిగా పేరు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్ రావు, గని రక్షణ అధికారి సంతోష్ రావు, అండర్ మేనేజర్లు రవీందర్, రాము, రవి తేజ, రాజు, వెంటిలేషన్ ఆఫీసర్ జగదీష్, ఇంజనీర్లు ప్రవీణ్, రమేష్, సంక్షేమ అధికారి సంతన్, ఏఐటీయూసీ గుర్తింపు సంఘం నేతలు పిట్ సెక్రెటరీ మారేపల్లి సారయ్య పాల్గొన్నారు.

## ఉద్యోగోన్నతితో మరింత బాధ్యతలు



నవతెలంగాణ-నస్పూర్

పదోన్నతి పొందడం వల్ల ఉద్యోగులపై మరింత బాధ్యతలు పెరుగుతాయని ఎస్ఆర్‌పీ-1గని మేనేజర్ విజయకుమార్ అన్నారు. బుధవారం ఎస్ఎల్పీ ప్రమోషన్ పొందిన ఉద్యోగులకు పదోన్నతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఘని మేనేజర్ మాట్లాడుతూ పదోన్నతితో ఉద్యోగులకు మరింత ఉత్తేజం కలుగుతుందని, సీనియర్ ఉద్యోగులు కొత్తగా వచ్చిన ఉద్యోగులకు మార్గదర్శకముగా ఉండాలని, ఉద్యోగులు భద్రత నియమాలను అనుసరించడంలో నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన అన్నీ జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి రాజేశ్ కుమార్, సంక్షేమాధికారి ఎస్ సాధన్, పిట్ సెక్రెటరి దాడి రాజయ్య, పిట్ ఆఫీస్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## 6న ఉచిత నేత్ర వైద్య శిబిరం

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని కాసిపేట, ముత్యంపల్లి సమీపంలోని హనుమాన్ మందిరం వద్ద ఈ నెల 6వ తేదీన ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల గౌతమి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని నేత్ర శిబిరం చైర్ పర్సన్ పుష్మెమల్ల రాజేందర్ ప్రసాద్ తెలిపారు. ఈ ఉచిత కంటి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మల్లన్న పట్నాలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో బోయిని యాదవ కులస్థుల మల్లన్న పట్నాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి యాదవ్ పాల్గొన్నారు.

# పూర్తి కాని ఇందిరమ్మ ఇండ్ల సర్వే

- జిల్లా వ్యాప్తంగా 76 శాతం
- బెల్లంపల్లిలో 93 శాతం సర్వే పూర్తి

నవతెలంగాణ-జైపూర్

జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 31 నాటికి ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి చేయాలన్న లక్ష్యం నెరవేరలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలన కార్యక్రమం ద్వార ధరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల జిల్లా పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 2 లక్షల 5 వేల 939 మంది ధరఖాస్తులు చేసుకున్నారు. ఈ క్రమంలో డిసెంబర్ 16న జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల వారిగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే మొదలైంది. డిసెంబర్ 31 నాటికి సర్వే నిర్వాహణ పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు ఒత్తిడి పెంచినా వివిధ కారణాలతో జిల్లాలో 76 శాతం సర్వే పూర్తి చేశారు. జిల్లా పరిధిలో భీమిని, బెల్లంపల్లిలో 93 శాతం, నెన్నల మండలంలో 92 శాతం, లక్షెటిపేట్ మున్సిపాల్టీలో 90శాతం సర్వే పూర్తయ్యింది. డిసెంబర్ 31 నాటికి జిల్లా వ్యాప్తంగా 1 లక్ష 56 వేల 667 కుటుంబాలకు సంబంధించిన సర్వే పూర్తిగా 8,685 కుటుంబాల సర్వే నిర్వాహణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. సర్వే పూర్తి చేసిన లక్ష 47 వేల 982 కుటుంబాలకు సంబందించిన సర్వే వివరాలు జిల్లా అధికారులకు నివేదించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా లక్ష్యానికి అనుగుణంగా సర్వే పూర్తికి జిల్లా స్థాయి అధికారులతో పాటు మండల పరిధి అధికారులు నిరంతరంగా ప్రయత్నించినా సర్వే క్రమంలో సిగ్నల్ వ్యవస్థ సహకరించకపోగా సర్వర్ సపోర్టు చేయని కారణంగా రోజు వారి లక్ష్యాల్లో సర్వే అధికారులు కొంత ఇబ్బందులు ఎదుర్కోవల్సి వచ్చింది. ఫలితంగా డిసెంబర్ నెల చివరి నాటికి పూర్తి చేయాలని భావించిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే జనవరి మాసంలో పూర్తి చేసుకోవల్సి వస్తోంది.



ఇందిరమ్మ ఇండ్ల సర్వే తీరు పరిశీలిస్తున్న ఎంపీఓ (ఫైల్)

**ఉమ్మడి మండలంలో..**

జైపూర్ మండలంలో గ్రామ పంచాయతీల వారిగా నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమం ద్వార వివిధ గ్రామ పంచాయతీల నుండి ఇందిరమ్మ ఇండ్ల మంజూరి కోసం 9,958 మంది ధరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో మండల పరిధిలో గత 15 రోజుల పాటు నిర్వహించిన ద్వార 7,063 కుటుంబాల సర్వే పూర్తి చేశారు. మండల పరిధిలో 71 శాతం సర్వే పూర్తి చేయగా బెజ్జాల, గంగిపల్లి గ్రామాల్లో 98 శాతం సర్వే పూర్తి చేసి నివేధికలు సమర్పించినట్లు స్థానిక ఎంపీఓ శ్రీపతి బాపురావు తెలిపారు.

**భీమారంలో..**

భీమారం మండలం నుండి ఇందిరమ్మ ఇండ్ల కోసం 4,671 మంది ధరఖాస్తు చేసుకున్నట్లు మండల పంచాయతీ అధికారి సతీష్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలో డిసెంబర్ 16కు ముందు నుండి సర్వే ప్రారంభించి మండల పరిధిలో 78 శాతం సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. 3,635 కుటుంబాల సర్వే పూర్తి చేసి నివేధికలు జిల్లా అధికారులకు నివేదించినట్లు తెలిపారు.

# రబీ పంటలు పరిశీలించిన ఏఓ



నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో రబీ పంటల సాగు మొదలైన నేపథ్యంలో బుధవారం వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 11 వేల ఎకరాల్లో వరి పంట సాగవుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా 200 ఎకరాల్లో వేరు శనగ, 300 ఎకరాల్లో మిర్చి పంటలు సాగు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. వరి పంటలు సాగు చేస్తున్న రైతులు పెట్టుబడులు తగ్గించుకోవడంతో పాటు లాభసాటి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని కోరుతున్నట్లు తెలిపారు. వరి సాగులో నాటు వేసే పద్ధతి కాకుండా నేరుగా పంట పొలంలో మొలక విత్తనం వెదజల్లడం లేదంటే డ్రమ్ సీడర్ ద్వార వరి పంట సాగు చేయాలని సూచిస్తున్నట్లు తెలిపారు. ఈ విధంగా చేయడం ద్వార నాటు ఖర్చులు తగ్గించుకోవడం ద్వార పంటల సాగు లాభసాటిగా ఉంటుందని అన్నారు. డ్రమ్ సీడర్ పద్ధతిలో పంటల సాగు చేస్తున్న రైతుల పంట క్షేత్రాలను సంధర్శించి సాగు మెలుకువలపై అవగాహణ కల్పించడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా రబీ పంటలకు సంబంధించి వ్యవసాయ విస్తరణ అధికారులు కొనసాగిస్తున్న క్రాఫ్ బుకింగ్ తీరుపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. వారంలో ప్రతి మూడు గ్రామ పంచాయతీల పరిధిలో పంటల సాగు తీరును పరిశీలించడంతో పాటు శాఖ పరంగా అందిన సమాచారం మేరకు ప్రతి గ్రామ పంచాయతీ శివారులో గుర్తించిన 15 సర్వే నెంబర్లలో పంటల సాగు పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. నేరుగా పంటలను సంధర్శించి పంటల సాగుకు సంబందించిన నివేధికలు యాప్ ద్వార ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని తెలిపారు. అంతే కాకుండా మండల పరిధిలో గల ఎరువుల దుకాలను ప్రతి వారం తనిఖీ చేసి పంటల సాగుకు సంబంధించిన రసాయన ఎరువుల నిల్వలు రైతులకు అందబాటులో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులకు రసాయన ఎరువులతో పాటు చీడపీడల నివారణకు సంబంధించిన పిచికారి మందులు అందుబాటులో ఉండే విధంగా ఎరువుల దుకాణాదారులను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు.



# భూమిని కబ్జా చేసి ఇబ్బందులు పెడుతున్నారు

- వారికి అధికారులు సహకరిస్తున్నారని ఆవేదన
- వృద్ధ దంపతులు ఇనిగంటి సత్యనారాయణ, పద్మ



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోగల గురువాపూర్ శివారులోని తమ భూములను ఈర్ల సుధాకర్ అనే వ్యక్తి అక్రమంగా పట్టా చేసుకొని కబ్జా చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అధికారులు కూడా కబ్జాదారులకే సహకరిస్తున్నారని మంథినికి చెందిన వృద్ధ దంపతులు ఇనిగంటి సత్యనారాయణ రావు, పద్మలు కన్నీరు మున్నీరయ్యారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గురువాపూర్ శివారులోని 74/1, 74/1/1 సర్వే నెంబర్లని 49.34 ఎకరాలు భూమి కొనుగోలు చేయగా 22.12 ఎకరాలు పట్టా చేసి మిగితా పట్టా చేయకుండా మాకు ఉన్న దాంట్లో రిజిస్ట్రేషన్ భూమిని దొంగతనంగా ఈర్ల సుధాకర్ అనే వ్యక్తి పట్టా చేసుకొని మా భూమిని కబ్జా చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మా భూమిలో మమ్మల్నే రానివ్వకుండా వృద్దులని కూడా కనికరం లేకుండా కబ్జా దారులు దౌర్జన్యం చేస్తూ భయాందోళన గురి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై న్యాయం చేయాలని కోరినా అధికారులు పట్టించుకోకుండా కబ్జా దారులకే సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ దగ్గరికి వెళ్తే పట్టించుకోకుండా కబ్జాదారులకే సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఎస్ఐ కూడా వాళ్ళకే సహకరిస్తున్నారన్నారు. వృద్దులని కనీస జాలి కూడా చూపడం లేదని, కాని కబ్జాదారులు వస్తే తహసీల్దార్, ఎస్ఐ వారికే పని చేస్తున్నారన్నారు. మా భూమిని కబ్జా చేసి మమ్మల్నే భయ పెడున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మంత్రి శ్రీధర్ బాబుని కూడా కలిసి మా సమస్యను వివరించి న్యాయం చేయాలని వేడుకోనున్నట్లు తెలిపారు. కబ్జాదారుల నుంచి మా భూమిని కాపాడి న్యాయం చేయాలని వేడుకున్నారు.

# అధ్యాపకునికి పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రదానం

నవతెలంగాణ-లక్సెట్టిపేట

స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ఎకనామిక్స్ లెక్చరర్ మోరుపుటాల తిరుపతి కరీంనగర్ జిల్లా శాతవాహన విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శాతవాహన విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ డిపార్ట్మెంట్‌లో పనిచేస్తున్న ప్రొఫెసర్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ . ఎం వరప్రసాద్ పర్యవేక్షణలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని స్వయం సహాయక బృందాల ద్వారా మహిళా సాధికారత అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ పరిశోధన ద్వారా స్వయం సహాయక సంఘాలు మహిళల అభివృద్ధి, వారి ఆర్థిక స్థితిగతులు, ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు మెరుగు పడటానికి తగిన సూచనలు, సలహాలు అందించారు. అదేవిధంగా తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో స్వయం సహాయక సంఘాల ప్రాముఖ్యతను వివరించడమే కాకుండా మహిళా సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం బ్యాంకులు చేస్తున్న కృషిని వివరించారు. వీరిని అభినందిస్తూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ యు ఉమేష్ కుమార్, పర్యవేక్షకులు ప్రొఫెసర్ ఎం వరప్రసాద్, అభినందించారు. వీరితోపాటు లక్సెట్టిపేట మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా మహాత్మ సంతోష్ అభినందనలు తెలియజేశారు.



## అయ్యప్ప స్వామి సన్నిదానానికి వంట పాత్రలు అందజేత

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ కాలనీ భక్తాంజనేయాలయం ఆవరణలోని అయ్యప్ప సేవా సన్నిదానానికి బుదవారం దాసరి శ్రీరాములు సుజాత, బన్నీ, సన్నీలు అయప్ప స్వామి పూజకు, అన్నదాన కార్యక్రమానికి వంట పాత్రలు అందజేశారు. అయ్యప్ప సేవా సన్నిదానం అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి భాస్కరి రాజేశంలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అయ్యప్ప స్వామి సన్నిదానంలో 41 రోజుల పాటు అయ్యప్ప స్వామి పూజలు, అన్నదానాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సాదినేని సతీష్, గాదాసు రాజు, బొద్దున రమేష్, ముల్కల్ల రవికృష్ణ, బజ్జూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

## రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి



నవతెలంగాణ-కాసిపేట

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని మందమర్రి జీఎం దేవేందర్ వివరించారు. బుధవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట-1 గనిలో నిర్వహించిన సమావేశంలో మందమర్రి జనరల్ మేనేజర్ జి.దేవేందర్ ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. ఉద్యోగులు విధులకు వచ్చేటప్పుడు ఇంటి నుండే హెల్మెట్ ధరించి రావాలని, అందరూ ఆరోగ్యంతో ఉంటే సంస్థ బాగుంటుందని, రక్షణతోనే ఉత్పత్తి చేయాలని, రక్షణ సూత్రాలు పాటించాలని, గత సంవత్సరం సాధించిన ఉత్పత్తి లక్ష్యాని కంటే ఈ సంవత్సరం ఎక్కువ ఉత్పత్తి తీసుకురావాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ దాగం మల్లేష్, మేనేజర్ భూ శంకరయ్య, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీషాన్, సర్వేయర్ ప్రభాకర్, బన్న లక్ష్మన్ దాస్, ఫిట్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ రాజేందర్, లింగయ్య, రవి, అనిల్, శ్రీనివాస్, రంజిత్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-మంచిర్యాల



జిల్లా కేంద్రంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో సంజీవయ్య కాలనీకి చెందిన మహంకాళి శ్రీనివాస్(50) అక్కడికి అక్కడే మృతి చెందినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ సీహెచ్ కిరణ్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంజీవయ్య కాలనీకి చెందిన శ్రీనివాస్ తన అన్నతో కలిసి బైక్‌పై ఐబీ చౌరస్తాలో రోడ్డు దాటు తుండగా శ్రీరాంపూర్ నుంచి మంచిర్యాలకు వెళ్తున్న ట్రాలి ఆటో అతి వేగంగా వచ్చి డీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మతుడు కూలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మృతుడి భార్య శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

## గని ఉద్యోగులకు ఉద్యోగోన్నతి పత్రాలు అందజేత



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-1వ గనిలో పని చేస్తున్న 49 మంది ఉద్యోగులకు ఉద్యోగొన్నతి పత్రాలను బుధవారం గని మేనేజర్ భూశంకరయ్య అందజేశారు. అండర్ గ్రౌండ్ ఉద్యోగులు 7 సంవత్సరాలకు వచ్చే రెగ్యూలర్ ప్రమోషన్స్‌ను వివిధ క్యాటగిరీలో పని చేస్తున్న వారికి యాజమాన్యం అందించింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, రక్షణాధికారి రవీంద్ర నిఖిల్, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, భూక్య సుమన్, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీషాన్, సర్వేయర్ ప్రభాకర్, బన్న లక్ష్మన్ దాస్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి లక్ష్మీ నారాయణ, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ రాజేందర్, లింగయ్య, రవి, అనిల్, శ్రీనివాస్, రంజిత్ పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి పత్రికలే



నవతెలంగాణ-జన్నారం

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య పత్రికలు వారదిగా నిలుస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలికి ప్రభుత్వానికి నివేదించే విధంగా ఉండాలని మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నవతెలంగాణ దినపత్రిక క్యాలెండర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవతెలంగాణ పత్రిక పేద ప్రజల కోసం బడుగు బలహీన వర్గాల కోసం పనిచేస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు మున్వరాలి ఖాన్, ఆర్టిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, జునుగురి మల్లయ్య, ఉజ్జల లచ్చన్న, రాజు పాల్గొన్నారు.

## ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

నవతెలంగాణ-జన్నారం

నూతన సంవత్సర వేడుకలను మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకుడు పురుషోత్తం పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అతనికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకొని ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు సమీపాన ఉన్న ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసుకున్నారు.